నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 4 జూన్ 2024 | SIDDIPET


తెలంగాణ ఉద్యమకారుడు ముస్త్యాల బాల్‌నర్సయ్యను సన్మానిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, తదితరులు

ఉద్యమకారులకు సన్మానం

కొమురవెల్లి/చేర్యాల, జూన్ 3 : తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట నడుస్తూ పలు కేసుల్లో జైలుకుపోయిన చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, చేర్యాల మండలంలోని ఆకునూరుకు చెందిన సుంకరి మల్లేశంగౌడ్, చేర్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్యను సోమవారం సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సన్మానించాడు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో పోరాటపటిమ చూపిన ఇద్దరినీ మాజీమంత్రి అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు సుంకరి మల్లేశంగౌడ్‌ను సన్మానిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, తదితరులు

సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

శతమానం భవతి

ఘనంగా మాజీమంత్రి హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు

- ప్రజానాయకుడికి సబ్బండ వర్గాల ఆశీర్వాదం
- పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు,అన్నదానాలు
- దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ

జిల్లావ్యాప్తంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కేకులు కట్ చేశారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్నదానం చేశారు. ప్రజాప్రతినిధులు దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

సిద్దిపేట అర్బన్, జూన్ 3: సిద్దిపేట పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా కిక్కిరిసి పోయింది. ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నందిని సిధారెడ్డి, దేవీప్రసాద్, ఫరూఖ్ హుస్సేన్, విరాహత్ అలీ, వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలతో కోలాహలంగా మారింది. సిద్దిపేట నియోజకవర్గంతో పాటు జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు అభిమానులు పార్టీ కార్యాలయానికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సిద్దిపేట మోడల్ బస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. అంతకు ముందు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు సిద్దిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

హరీశ్‌రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షం!


దుబ్బాక బస్టాండు వద్ద బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- తెలంగాణ ఉద్యమకారులను అవమానపర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన గడ్డ దుబ్బాక
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర సాధనతోపాటు ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఆహర్నిషలు కృషి చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సమైక్యాంధ్ర పాలకుల నిరంకుశ పాలనకు చరమగీతం పాడి, తెలంగాణ ప్రజలకు పరిపాలన సౌలభ్యంతో పాటు స్వేచ్ఛావాయువులు అందించిన ఘనత మన ఉద్యమనేత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక బస్టాండు వద్ద బీఆర్ఎస్ జెండావిష్కరణలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో అలుపెరగని పోరాటాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. రాష్ట్ర సాధనలో కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధమయ్యారని గుర్తు చేశారు. ఉద్యమాలకు మారుపేరుగా నిలిచిన దుబ్బాక గడ్డ తెలంగాణ ఉద్యమంలో ముందంజలో ఉన్నదన్నారు. ఉద్యమంలో కేసీఆర్ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని దుబ్బాక ఉద్యమకారులు విజయవంతం చేశారని, రాష్ట్ర సాధనలో ఎందరో ఉద్యమకారులు బలిదానమయ్యారని, అమరుల త్యాగం మర్చిపోలేనిదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ అమరులను, ఉద్యమకారులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపర్చిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికీ, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార అన్ని వర్గాల వారికి , బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితా భూంరెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సోలిపేట సుజాత, సతీశ్‌రెడ్డి, భూంపల్లి మనోహర్‌రావు , వెంకటనర్సింహారెడ్డి, రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, కార్తిక, నారాగౌడ్, కృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబ్బాకలో జెండావిష్కరణ సందర్భంగా జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకులు

ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ సిద్దిపేట

సిద్దిపేట లేకుంటే కేసీఆర్ లేడు..కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు

- తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో సిద్దిపేటది కీలకపాత్ర
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే ఆ కల సాకారమైంది...
- ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సిద్దిపేట మట్టిబిడ్డలు
- పోరాటంలో పాల్గొన్న వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఘనంగా తెలంగాణ దశాబ్ది ముగింపు ఉత్సవాలు


సిద్దిపేటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

దశాబ్ది ఉత్సవాల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, జూన్ 3: తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ సిద్దిపేట అని, 1969 ఉద్యమానికి, మలిదశ ఉద్యమానికి విజయాన్ని అందించింది సిద్దిపేట అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ పరిధిలో ఉన్న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..కొన్ని దశాబ్దాల పోరాటం వల్లే తెలంగాణ వచ్చిందని, ఆ కలను నిజం చేసింది బీఆర్ఎస్ అన్నారు. సిద్దిపేట లేకుంటే కేసీఆర్ లేడు.. కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదన్నారు. ఉద్యమంలో సిద్దిపేట మట్టిబిడ్డలు రాష్ట్రస్థాయిలో కీలక పాత్ర పోషించారని, ఉద్యమ సమయంలో నందినిసిధారెడ్డి, రమణాచారి, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, దేవీప్రసాద్, రామలింగారెడ్డి సేవలు మరువలేనివన్నారు. వారిని గుర్తించుకోవడం మన కర్తవ్యమన్నారు. ఉద్యమంలో నిస్వార్థంగా సేవచేసిన వారిని గుర్తించుకోవడం నిజమైన పండుగ అన్నారు. తెలంగాణ ఉద్యమం చాలాసార్లు విఫలమైందని.. కానీ ఉద్యమానికి, కేసీఆర్‌కు సిద్దిపేట మట్టిబిడ్డలు కుడిభుజంగా నిలిచారన్నారు. ఉద్యమకారులున్న ఘనత బీఆర్ఎస్‌కు దక్కుతుందని.. కరెంట్ కోసం రాజీవ్ రహదారిని దిగ్బంధం చేశామని.. ఎన్నో త్యాగాలు, పోరాటాలు ఉన్నాయన్నారు. అరెస్ట్ అయినా.. జైల్లో ఉన్నా బాధపడింది, భయపడింది లేదన్నారు. ఈ పోరాటంలో పాల్గొన్న వారందరికీ హరీశ్‌రావు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి ఆశలు, పదవుల ఆశలు లేకుండా నాడు తెలంగాణ ఉద్యమంలో నిస్వార్థంగా పాల్గొన్నారని.. వారిని సన్మానించుకోవడం మన కర్తవ్యమన్నారు. కూడవెల్లి, హల్దీ వాగుల్లో నీళ్లు ఎండిపోగా.. కేసీఆర్ బస్సుయాత్ర చేయగాని నీళ్లు వచ్చాయన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను శాలువా, మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, జర్నలిస్ట్ సంఘం నాయకుడు విరాహత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను సన్మానించుకోవడం గౌరవం

తెలంగాణ ఉద్యమంలో 14 ఏండ్లు ఎంతో కష్టపడి పని చేశా. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉద్యమకారులను సన్మానించుకోవడం ఎంతో గౌరవం. సుదీర్ఘ కాలం పాటు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపిన ఉద్యమకారులను గుర్తుంచుకోవాలి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడంతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని బీఆర్ఎస్ నాయకులు కొనసాగించాలి.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, దుబ్బాక

రేవంత్‌రెడ్డి ఎప్పటికీ ఉద్యమకారుడు కాలేడు..

రేవంత్‌రెడ్డి సీఎం అయితే కావచ్చు. కానీ తెలంగాణ ఉద్యమకారుడు ఎప్పటికీ కాలేడు. సిద్దిపేటలో ఉండి తెలంగాణ కోసం పోరాడిన ఒక ఉద్యమకారుడి పాద ధూళికున్న విలువ కూడా రేవంత్‌కు లేదు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ఎంతోమంది ప్రాణాలను తీసింది కాంగ్రెస్ పార్టీయే. కేంద్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు, దేశంలో లౌకిక విలువలను, మత సామరస్యాన్ని కాపాడేందుకే బీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశాం.

– దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ

ఉద్యమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్న..

14 ఏండ్లు తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం తన అదృష్టంగా భావిస్తున్నా. తెలంగాణ గురించి అనేక మంది చాలా రకాలుగా మాట్లాడినా.. ఎవరికీ సాధ్యం కాలేదు. కేవలం కేసీఆర్ వల్లనే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. ఉద్యమంలో నిస్వార్థంగా సేవ చేసిన వారిని గుర్తించుకోవడం నిజమైన పండుగ. తెలంగాణ ప్రజలు వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

– రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్యే, మానకొండూర్

మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన గడ్డ

తెలంగాణ మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన గడ్డ సిద్దిపేట. ఇలాంటి గడ్డమీద హరీశ్‌రావు చేతుల మీదుగా ఉద్యమకారులకు సన్మానం చేయడం అదృష్టం. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రతిఒక్కరూ ఐకమత్యంగా పోరాడాలి. రాష్ట్ర సాధనలో ఎందరో ఉద్యమకారులు బలిదానమయ్యారు. వారి త్యాగం మరచిపోలేనిది.

–దేవీప్రసాద్, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉంది..

శాంతియుతంగా ఎంతో నిబద్ధతతో పోరాడి తెలంగాణ సాధించామో.. అంతే నిబద్ధతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతటి ఉద్యమానికైనా ప్రజలందరూ సిద్ధంగా ఉండాలి. దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, హుస్నాబాద్

నాడు జై తెలంగాణ అంటేనే భయపడే పరిస్థితి

1969లో ఉద్యమాలు చేశాం. నాడు తెలంగాణ అంటేనే జైల్లో పెట్టే పరిస్థితులు ఉండే. 1996లో సిద్దిపేటలో మంజీరా రచయితల సంఘం ఏర్పాటు చేసి తెలంగాణ ఆవశ్యకతను వివరించాం. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేట గడ్డ రక్షణ కవచంగా నిలిచింది. 14ఏండ్ల సుధీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది.

– నందిని సిధారెడ్డి, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్

హాజరైన బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

{ వీడనున్న ఉత్కంఠ... తేలనున్న అభ్యర్థుల భవితవ్యం }

- 103 టేబుళ్లు... 147 రౌండ్లు
- మెదక్ పార్లమెంట్ బరిలో 44 మంది అభ్యర్థులు
- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- అంతకుముందు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- మెదక్ జిల్లాలో 144 సెక్షన్ అమలు

నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన అధికారులు

మెదక్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఉత్కంఠ మంగళవారం వీడనున్నది. ఎన్నికల ఫలితాలపై అన్ని పార్టీల నేతలు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని రెండు కళాశాలల్లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్లు లెక్కిస్తారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, దుబ్బాక, గజ్వేల్ సెగ్మెంట్ల ఓట్లను లెక్కిస్తారు. విశ్వేశ్వరయ్య బ్లాక్‌లో మెదక్ నియోజకవర్గం, ఆర్యభట్ట బ్లాక్‌లో సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలు, సెమినార్ హాల్ చాణక్య బ్లాక్‌లో గజ్వేల్ నియోజకవర్గ ఓట్లను లెక్కించగా, ఎమ్మిడి లక్ష్మీనర్సయ్య మెమోరియల్ బ్లాక్‌లో నర్సాపూర్ నియోజకవర్గం ఓట్లను లెక్కిస్తారు. గిరిజన బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల గ్రౌండ్ ఫ్లోర్‌లో సంగారెడ్డి, మొదటి అంతస్తులో పటాన్‌చెరు ఓట్లను లెక్కింపు చేస్తారు. ఏడు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను బీవీఆర్ఐటీలోని ఆడిటోరియంలో లెక్కిస్తారు.

నియోజకవర్గాల వారీగా టేబుళ్లు...

నియోజకవర్గాల వారీగా ఓట్లను లెక్కిస్తారు. అత్యధికంగా పటాన్‌చెరు నియోకవర్గానికి 18 టేబుళ్లు ఏర్పాటు చేయగా, గజ్వేల్ నియోజకవర్గానికి 15, మెదక్‌కు 14, నర్సాపూర్‌కు 14, సిద్దిపేటకు 14, దుబ్బాకకు 14, సంగారెడ్డికి 14 మొత్తం 103 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ముందుగా 14,297 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును ప్రారంభించి రెండు రౌండ్లలో పూర్తి చేయనున్నారు. బరిలో 44 మంది ఉండడంతో తుది ఫలితం వచ్చేందుకు సాయంత్రం వరకు సమయం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

144వ సెక్షన్ అమలు

ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ బాలస్వామి తెలిపారు. 423 మంది పోలీస్ ఫోర్స్‌తోపాటు 3 ప్లాటూన్ల టీజీఎస్పీ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురి కంటే ఎక్కువ గుంపులు గుంపులుగా తిరగటం చేయకూడదని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు.

నియోజకవర్గం	మెదక్	నర్సాపూర్	సిద్దిపేట	సంగారెడ్డి	పటాన్‌చెరు	దుబ్బాక	గజ్వేల్
టేబుళ్లు	14	14	14	14	18	14	15
రౌండ్లు	20	22	20	21	23	19	22

నేడు వీడనున్న ఉత్కంఠ

- జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు
- ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు, గరిష్టంగా 23 రౌండ్లు

రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన అధికారులు

సంగారెడ్డి జూన్ 3 (నమస్తే తెలంగాణ): జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని గీతం యూనివర్సిటీలో ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొదట బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఈవీఎం ఓట్లను నియోజకవర్గాల వారీగా లెక్కిస్తారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఏడు నియోజకవర్గాలకు 14 చొప్పున కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. కనిష్టంగా 19 రౌండ్ల నుంచి గరిష్టింగా 23 రౌండ్ల వరకు ఓట్ల లెక్కించనున్నారు.

మొదట జుక్కల్, బాన్సువాడ ఫలితాలు

జహీరాబాద్ పార్లమెంట్‌కు 1973 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగ్గా 74.63 శాతం పోలింగ్ నమోదైంది. 12,25,049 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొదట జుక్కల్, బాన్సువాడ ఎన్నికల ఫలితాలు వెలవడనున్నాయి. జుక్కల్‌లో 255 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్లు, 19 రౌండ్లు ఓట్లు లెక్కించనున్నారు. బాన్సువాడలోని 258 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్లలో 19 రౌండ్లు ఓట్లు లెక్కిస్తారు. ఎల్లారెడ్డిలో 270 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్ల ద్వారా 20 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు. కామారెడ్డికి సంబంధించి 266 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్లలో 19 రౌండ్లు ఓట్లు లెక్కిస్తారు. నారాయణఖేడ్‌లో 296 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లలో 22 రౌండ్లలో ఓట్లు లెక్కింపు పూర్తవుతుంది. అందోలులో 313 పోలింగ్ కేంద్రాలకు సంబందించి 14 టేబుళ్లలో 23 రౌండ్లు ఓట్లు లెక్కింపు జరుగుతుంది. జహీరాబాద్‌కు సంబంధించి 14 టేబుళ్ల ద్వారా 23 రౌండ్లలో ఓట్లు లెక్కిస్తారు. ఓట్ల లెక్కించే టేబుళ్ల వద్ద ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఏఆర్వోలు ఉంటారు. ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి.తివారీ, ప్రదీప్‌సింగ్ సంగ్వాత్ పర్యవేక్షణలో ఓట్ల లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గీతం యూనివర్సిటీ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.